

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బద్వేలు మండలం రాజుపాలెం గ్రామ పొలాల్లో వెంకటశెట్టిపల్లె గ్రామానికి చెందిన బీరం నరసింహారెడ్డి (55) అనే వ్యక్తి బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. - 8లో



ఆదాయానికి 'గండి' కొట్టే యత్నం!

గండి వీరాంజనేయుడి దగ్గర తలనీలాలను పోగు చేసుకునే హక్కు కోసం నిర్వహించిన టెండర్లలో టెండరుదారుల పాచిక పారలేదు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.2 /15.6

జిల్లాలో గురువారం 15.6 - 32.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2. కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

6న బ్ర.మఠంలో బహిరంగ వేలం

బ్రహ్మంగారిమఠం : ఫిబ్రవరి 6న బ్రహ్మంగారి మఠం దేవస్థానం పరిధిలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు మఠం మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. భక్తులు సమర్పించుకునే తలనీలాలు, పోలేరమ్మ దగ్గర టెంకాయల అమ్మకం, కొబ్బెర చిప్పల సేకరణ, మరుగుదొడ్ల నిర్వహణ, పాదరక్షలు భద్రపరచుట, దేవస్థానం పరిధిలో పుస్తకాల విక్రయం వంటివాటికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనదలచినవారు ఉదయం 9 గంటలకు తలనీలాల కోసం రూ.25 లక్షలు, పోలేరమ్మ గుడిదగ్గర టెంకాయల అమ్మకానికి రూ.1లక్ష, కొబ్బెర ముక్కల వసూలీకు రూ.75వేలు, మరుగుదొడ్ల నిర్వహణకు రూ.50వేలు, పుస్తకాల విక్రయానికి రూ.1లక్ష నగదుతో వేలానికి రావాలని సూచించారు.

వైద్య సేవల్లో జిల్లాకు 'ఏ' గ్రేడ్

కడప రూరల్: ప్రతినెల ప్రగతి నివేదికలో భాగంగా డిసెంబర్ మాసానికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు రాష్ట్ర స్థాయిలో ఏ గ్రేడ్ వచ్చినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు అభినందనలు తెలిపారు. వైద్య సేవల్లో జిల్లా మొదటి స్థానంలో వచ్చేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని వివరించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న సీఐ కృష్ణకుమార్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం గీత కులాలకు చెందిన వారికి కేటాయించిన 14 మద్యం దుకాణాలకు గాను కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు కేటాయించిన మూడు దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ స్టేషన్ పరిధిలో కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో -ఈడిగ, చింతకొమ్మదిన్నె-గౌడ, ఖాజీపేట-గౌడ్ కులాలకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. దరఖాస్తు దారులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫీజు రూ. 2లక్షలని వివరించారు. దరఖాస్తు దారులు ఫిబ్రవరి 5న సాయంత్రం 5 లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. 7న కలెక్టరేట్ సభాభవన్‌లో డ్రా ఉంటుందన్నారు.

అసంఘటిత కార్మికుల నమోదు

కడప సెవెన్‌రోడ్స్ : ఈ-శ్రమ్ పోర్టల్‌లో జిల్లాలోని అసంఘటిత కార్మికుల నమోదుపై కలెక్టర్ శ్రీధర్ గురువారం సమీక్షించారు. జిల్లాలో 7,50,000 మందిని నమోదు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు వివిధ అసంఘటిత రంగాలకు సంబంధించి 3,66,162 మందిని నమోదు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నిశాఖల సమన్వయంతో మిగిలిన లక్ష్యాలను పూర్తిచేయాలని ఉప కార్మిక కమిషనర్‌ను ఆదేశించారు. సంబంధిత ప్రభుత్వ శాఖలు కార్మిక సెస్సును భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు జమ చేయాలని చెప్పారు.

11వ బెటాలియన్ కమాండెంట్‌గా ఆనందరెడ్డి

కడప అర్బన్ : భాకరాపేటలోని ఏపీఎస్‌పి 11వ బెటాలియన్ కమాండెంట్ కె. ఆనందరెడ్డిని నియమిస్తూ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నలుగురు పోలీసు అధికారులను బదిలీ చేశారు. ఇందులో భాగంగా కొన్ని రోజులుగా ఖాళీగా ఉన్న 11 బెటాలియన్ కమాండెంట్ పోస్టును ఆనంద్ రెడ్డితో భర్తీ చేశారు.

కష్టపడేవారికి సముచితస్థానం





చలమారెడ్డిపల్లెలోని ఎంఎస్ఆర్ వ్యాలీలో జిల్లా పార్టీ సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తున్న రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్రంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు

- కూటమికి ఓటేసినందుకు ప్రజల్లో పశ్చాత్తాపం మొదలైంది
- గతంలో జరిగిన పొరపాట్లు ఇకపై జరగవు
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ఇటీవల పార్టీ పదవులు చేపట్టిన వారితో ప్రమాణం చేయిస్తున్న నేతలు

కడప కార్పొరేషన్ : పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలు, నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం స్థానిక చలమారెడ్డిపల్లె సమీపంలోని ఎంఎస్ఆర్ హిల్ వ్యాలీలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జిల్లా కమిటీ, అనుబంధ విభాగాల అధ్యక్షులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పెద్దిరెడ్డి మాట్లాడుతూ 26 జిల్లాల్లో తొలిసారి జిల్లా కమిటీ వేసి, జిల్లా కమిటీ సమావేశం నిర్వహించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డిని అభినందించారు. ఈ పదవులు అలంకారప్రాయం కాకూడదని, అహర్నిశలు కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. అన్ని జిల్లాలకు వైఎస్సార్ జిల్లా స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నీ లెక్కలు వేసుకొని పార్టీ మేనిఫెస్టో ప్రకటిస్తారని, 2014 ఎన్నికల్లో రైతు రుణమాఫీ ఇస్తామని ప్రకటించాల్సిందిగా తాము కోరితే ఆయన అంగీకరించలేదన్నారు. వైఎస్ఆర్ తనయుడు హామీ ఇచ్చి అమలు చేయలేదని ప్రజలు చెప్పుకుంటారని...డ్వాక్రా రుణాలు మాత్రమే మాఫీ చేస్తామని ప్రకటించారన్నారు. 2024 ఎన్నికల్లో కూడా సరిగ్గా అదే జరిగిందన్నారు. చంద్రబాబు, బీజేపీ, పవన్ కళ్యాణ్ అబద్ధాలు చెప్పి ప్రజలను మాయ చేశారన్నారు. ఈ ఎనిమిది నెలల కూటమి పాలనలో ఎవరూ సంతోషంగా లేరని, వ్యాపారాలు వెలవెలబోతున్నాయన్నారు. ఈ ప్రభుత్వానికి ఓటేసినందుకు ప్రజలు, ఆ పార్టీ అధికారంలోకి వస్తే లాభపడుతామని భావించిన వారు పశ్చాత్తాపపడుతున్నారన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు జరగనివ్వబోమని, 2029 ఎన్నికల్లో పార్టీకి తిరుగులేని విజయాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే దాసరి సుధ, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేష్ యాదవ్, డీసీ గోవిందరెడ్డి, నేతలు అంజద్‌బాషా, శ్రీకాంత్ రెడ్డి, సురేష్‌బాబు తదితరులు ప్రసంగించారు. కూటమి పార్టీలు కలిసి సాధ్యం కాని హామీలు ఇచ్చాయన్నారు. ఇప్పుడు హామీలు అమలు చేయలేక చేతులెత్తేశాయని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వానికి కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యిందన్నారు. ప్రజల కోసం, మన కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ సారి కార్యకర్తలను గుర్తిస్తామని.. అందరికీ మంచి జరుగుతుందని నేతలు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, పార్టీ కోశాధికారి ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రభుత్వం వదిలేసింది - రవీంద్రనాథ్‌రెడ్డి

ఎన్నికల మేనిఫెస్టోను, రాష్ట్ర అభివృద్ధిని కూటమి ప్రభుత్వం వదిలేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కమిటీ, అనుబంధ కమిటీల్లో నియమితులైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే అందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి తగిన శిక్షణ ఇస్తామన్నారు. టీడీపీ వేధింపులు, అక్రమ కేసులపై కలిసికట్టుగా పోరాడుతామని పిలుపునిచ్చారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం - అమర్‌నాథ్‌రెడ్డి

ఇప్పుడు పదవులు వచ్చిన వారికే కాకుండా, రాని వారికి కూడా త్వరలో పదవులు వస్తాయని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు తామంతా అండగా ఉంటామన్నారు. గతంలో కార్యకర్తలకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని, ఈ సారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పక మేలు చేస్తారని తెలిపారు. 2029 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలన్నారు.

పేదలకు మేలు చేయడమే విధ్వంసమా

వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : పేదలకు మేలు చేయడమే వైఎస్ జగన్ చేసిన విధ్వంసమా...అని వైస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన కడపలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు అనేక హామీలిచ్చారని, ఇప్పుడు ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేదని మాట మారుస్తున్నారన్నారు. ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఎక్స్‌పర్ట్‌ని, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ బాగా తెలుసని చెప్పిన చంద్రబాబుకు హామీలిచ్చే ముందు ఆర్థిక పరిస్థితి తెలీదా... అని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన ఈ 8 నెలల్లోనే రూ.1.19 లక్షల కోట్లు అప్పులు చేశారని, ఏ ప్రాజెక్టు చేపట్టకుండా, ఏ ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వకుండా దేని కోసం ఖర్చు చేశారని నిలదీశారు. అమరావతిలో కూడా సొంత లాభం, సొంత సంపాదన కోసమే ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రెండేళ్లు కరోనా వచ్చినా నిర్ణయించిన తేదీల ప్రకారమే సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ఏపీ మరో శ్రీలంక అవుతుందని పవన్‌కళ్యాణ్, పురందరేశ్వరి అబద్ధాలు చెప్పారని, రాష్ట్రానికి రూ.14లక్షల కోట్లు అప్పుందని ఒకరు, రూ.12లక్షల కోట్లు అప్పుందని మరొకరు తప్పుడు లెక్కలు చెప్పారన్నారు. రాష్ట్రానికి ఉన్న అప్పు రూ.6.49లక్షల కోట్లేనని వారి మంత్రే చెబుతున్నారని, ఇందులో అధిక మొత్తం టీడీపీ హయాంలో చేసినవేనన్నారు, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అరాచకాలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

శేష వాహన గోవిందా... శ్రీ సూర్య దేవ గోవిందా..!



పెద్ద శేష వాహనంపై ఊరేగుతున్న కడప రాయుడు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం స్వామి ఉదయం సూర్యప్రభ, రాత్రి పెద్ద శేష వాహనంపై కొలువుదీరారు. ఉత్సవాలలో భాగంగా ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, అర్చకులు మయూరం కృష్ణమోహన్ ఆధ్వర్యంలో త్రివిక్రమ్ బృందం ఉదయం స్నపన తిరుమంజనం నిర్వహించగా, సాయంత్రం ఊంజల సేవ చేశారు. ఊరేగింపులో మహిళా భక్తుల కోలాట బృందాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. స్వామి పల్లకీలో మాడవీధుల్లో భక్తులకు దర్శనమిస్తుండగా, స్వామి రాకను తెలుపుతూ మహిళా భక్తులు పసుపు వర్ణ సంప్రదాయ దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో దేవతామూర్తులను కొనియాడుతూ భక్తిగీతాలను కోలాట నృత్యాలు చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు.

కడప రాయునికి కల్పవృక్షం కానుక

దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామికి ఆలయ అర్చక బృందం కల్పవృక్షాన్ని కానుకగా అందించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తమ కుటుంబాలు మొక్కు తీర్చుకోవడంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా రూ. 6 లక్షలు విలువజేసే ఇత్తడి కల్పవృక్ష వాహనాన్ని స్వామి సేవలకు సమర్పిస్తున్నామని తెలిపారు.

బ్యాంకర్ల సహకారం అవసరం

ప్రత్యేక డీసీసీ, డీఎల్ఆర్‌సీ బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ సంక్షేమ పథకాల అములులో బ్యాంకర్ల ఆర్థిక సహకారం ఉంటేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్‌సీ) బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూర్చేలా రుణ సదుపాయాలు కల్పించాలన్నారు. సురక్షితమైన డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ జనార్దనం, నాబార్డ్ ఏజీఎం విజయ విహారి, కెనరా బ్యాంకు ఏజీఎం మురళీ మోహన్, ఎస్‌బీఐ ఏజీఎం వాణీ కిషోర్ కుమార్ రెడ్డి, ఏపీజీబీ ఏజీఎం శ్రీనివాస ప్రసాద్, కేడీసీసీ సీఈఓ రాజామణి, డీఆర్డీఏ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, సురేష్ రెడ్డి, ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్ ఈడీ డా. వి.బ్రహ్మయ్య, బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, పరిశ్రమల శాఖ జీఎం చాంద్ బాషా పాల్గొన్నారు.

బాలల సంక్షేమం.. 'మిషన్ వాత్సల్య' లక్ష్యం

అనాథ బాలల సంక్షేమం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నాయని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని బోర్డు మీటింగ్ హాలులో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథక అమలు తీరు, బాల కార్మికులు, బాల్య వివాహాలు, అడాప్షన్, చిన్నపిల్లల భిక్షాటన వంటి వివిధ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మికుల నిర్మూలన కోసం లేబర్ డిపార్టుమెంటు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సమన్వయంతో జిల్లాలో ఎక్కడ బాల కార్మికులు ఎక్కువగా పని చేస్తున్నారు? ఏ కారణాల చేత వారు బాల కార్మికులుగా మారుతున్నారు? వంటి అంశాలపై ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వారికి మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఇచ్చే నాలుగు వేల రూపాలు సహాయం అందించి వారిని బడి బాట పట్టేలా పని చేయాలన్నారు. ప్రధానంగా లేబర్ శాఖ అధికారులు వ్యూహాత్మకంగా హోటల్స్, మెకానిక్ షాపుల పై నిరంతపు పర్యవేక్షణ వుంచి వారానికి నాలుగు సార్లు తనిఖీలు నిర్వహించాలన్నారు. చైల్స్ హెల్ప్ లైన్ 1098 సేవలు అందరికీ తెలిసేలా జిల్లాలో విరివిగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి,ఐసిడిఎస్ పీడి శ్రీలక్ష్మి, లేబర్ శాఖ అధికారి శ్రీకాంత్ నాయక్, జడ్పీ సీఈవో ఓబులమ్మ, పంచాయతీ రాజ్ శాఖ అధికారిని రాజ్యలక్ష్మి, డీఎస్పీ రమాకాంత్, విద్యా శాఖ, మిషన్ వాత్సల్య సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరు పీఎస్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



వల్లూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి సీఐ ఎస్‌కే రోషన్‌కు సూచనలు చేస్తున్న ఎస్పీ ఈజీ అశోక్ కుమార్

వల్లూరు : మండల కేంద్రమైన వల్లూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తనిఖీ చేశారు. ఎస్పీ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారిగా గురువారం వల్లూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదులపై సరైన రీతిలో క్షుణ్ణంగా విచారణ జరిపి నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలన్నారు. సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. వృత్తి పరమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తానని ఎస్పీ భరోసా ఇచ్చారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. నేరాలు జరగకుండా పగలు, రాత్రి ముమ్మరంగా గస్తీ నిర్వహించాలని సూచించారు. పాత నేరస్థులు, సస్పెక్టెడ్స్‌ల కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను త్వరగా డిస్‌పోజ్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ మండలం పరిధిలో దక్షిణ కాశీగా పిలవబడే పుష్పగిరి క్షేత్రం ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీఐ ఎస్‌కే రోషన్‌కు సూచించారు. జిల్లా ఎస్పీ వెంట కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ దారెడ్డి భాస్కర్ రెడ్డి ఉన్నారు.

ఒంటిమిట్టకు చేరిన శ్రీవారి లడ్డూలు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయానికి గురువారం తిరుమల శ్రీవారి లడ్డూలు చేరాయి. తిరుమల నుంచి ప్రత్యేక వాహనంలో 2 వేల లడ్డూలు వచ్చాయి. గతంలో రెండు, నాలుగో శనివారాల్లో ఇచ్చే లడ్డూలు గత కొన్ని నెలలుగా ప్రతిరోజూ ఇస్తున్నారు.

దేవుని కడపకు ఒంటిమిట్ట రామయ్య అశ్వాలు

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి రథానికి ఉన్న అశ్వాలు దేవుని కడప రథోత్సవానికి తరలివెళ్లాయి. దేవుని కడపలో ఫిబ్రవరి 4న రథోత్సవం జరుగుతుంది. టీటీడీ అధికారుల ఆదేశాల మేరకు అశ్వాలను గురువారం ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి రథం నుంచి వేరుచేసి ఓ ప్రైవేటు వాహనంలో తీసుకెళ్లారు.

హత్యరాలలో 3న వేలం పాట

రాజంపేట టౌన్ : పవిత్ర పుణ్యక్షేత్రం హత్యరాలలో టెంకాయలను విక్రయించుకునేందుకు ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 11 గంటలకు త్రేతేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు సమూహ దేవస్థానాల కార్యనిర్వహణాధికారి గంగవరం కొండారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ధరావత్తు కింద రూ.50 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. హెచ్చుపాటదారుడు పాట ముగిసిన వెంటనే డిపాజిట్‌తో కలిపి సగం డబ్బులను చెల్లించాలన్నారు. మిగతా మొత్తం పదిరోజుల లోపు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. వేలంపాట దక్కించుకున్న వారు ఒక్కో టెంకాయను యాభై రూపాయిలకు మాత్రమే విక్రయించాలన్నారు. వేలంపాటను దక్కించుకున్న వారు ఈఏడాది ఫిబ్రవరి 3వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 31వ తేదీ వరకు మాత్రమే హత్యరాలలోని త్రేతేశ్వర స్వామి ఆలయ పరిసర ప్రాంతంలో టెంకాయలను విక్రయించుకోవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

చిన్న పిల్లల ఆసుపత్రి ఏర్పాటు అభినందనీయం



కమలాపురంలో చిన్న పిల్లల హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

కమలాపురం : కమలాపురం పట్టణంలో చిన్న పిల్లల ఆసుపత్రి ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఎమ్మెల్యే చైతన్యరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్‌బీఐ ఎదుట చిన్న పిల్లల వైద్య నిపుణుడు ఫారుక్ హుసేన్ నూతనంగా ఏర్పాటు చేసిన పరి చిన్న పిల్లల హాస్పిటల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలకు వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో డాక్టర్ ఫారుక్ హుసేన్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



బంగారు తాళిబొట్టు ఇచ్చిన ఆటో డ్రైవర్ నజీర్ బాషాను సత్కరిస్తున్న సీఐ

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఆచార్లకాలనీకి చెందిన పోచిమరెడ్డి స్వరూప అనే మహిళ స్థానిక వివేకానంద క్లాత్ మార్కెట్‌లోని వినాయక శారీస్ సెంటర్‌లో పని చేస్తోంది. బుధవారం సాయంత్రం ఆమె పని ముగించుకొని ఇంటికి వెళ్లడానికి వివేకానంద క్లాత్ మార్కెట్ ఎదురుగా ఆటో ఎక్కి కాలువకట్ట మల్లెలమ్మ గుడి వద్ద దిగింది. ఆటో డ్రైవర్ షేక్ నజీర్ బాషా రాత్రి శ్రీనివాసనగర్‌లోని తన ఇంటికి వెళ్లాక తన ఆటోలో ఒక చిన్న బాక్స్‌లో సుమారు మూడు తులాలకుపైగా ఉన్న బంగారు తాళిబొట్టు చైన్ గుర్తించి తన ఆటోలో ఎవరు మర్చిపోయారని గుర్తించాడు. గురువారం ఉదయం అతను టూటౌన్ సీఐ యుగంధర్‌ను కలిసి జరిగిన విషయం చెప్పి బంగారు తాళిబొట్టు చైన్‌ను అప్పగించాడు. బంగారు తాళిబొట్టు చైన్‌ను మరచిపోయిన మహిళ పోచిమరెడ్డి స్వరూపగా గుర్తించి అప్పగించారు. రూ.2.50 లక్షల విలువైన ఈ బంగారు చైన్‌ను అప్పగించిన ఆటో డ్రైవర్ నజీర్ బాషా నిజాయితీని టూటౌన్ సీఐ యుగంధర్ అభినందించారు. ఆటో డ్రైవర్‌ను సీఐ శాలువా కప్పి సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ట్రాక్టర్‌ను ఢీకొనడంతో బోల్తాపడిన కోళ్ల వాహనం

ఖాజీపేట : ఆంజనేయకొట్టాలు నుంచి బద్వేలుకు వెళ్లే రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు.. వివరాలిలా.. కదిరి, రాయచోటి, కడప నుంచి కోళ్ల వ్యర్థాలతో నెల్లూరుకు బొలెరో వాహనం వెళుతోంది. ఖాజీపేట మండలం బోసిరెడ్డిపల్లె సమీపంలోని ప్రధాన రహదారి వద్దకు రాగానే ఆగి ఉన్న ఇసుక ట్రాక్టర్‌ను గురువారం తెల్లవారు జామున బొలెరో వాహనం ఢీకొంది. వాహనంలో డ్రైవర్‌తోపాటు ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. అందులో బత్తిన హరికృష్ణ(26) అక్కడికక్కడే మృతి చెందగా వీరన్నతో పాటు మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతి చెందిన వ్యక్తి నంద్యాల జిల్లా గడివేముల మండలం పెద్ద చింతకుంట గ్రామానికి చెందిన వాడిగా తెలిసింది. పోలీసులు మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి చనిపోయాడని కుటుంబ సభ్యుల ఆరోపణ
- బద్వేలు – కడప రహదారిపై మృతదేహంతో ఆందోళన



రోడ్డుపై బైఠాయించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు



బీరం నరసింహారెడ్డి (ఫైల్)

బద్వేలు అర్బన్ : బద్వేలు మండలం రాజుపాలెం గ్రామ పొలాల్లో వెంకటశెట్టిపల్లె గ్రామానికి చెందిన బీరం నరసింహారెడ్డి (55) అనే వ్యక్తి బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే రాజుపాలెం గ్రామ పొలాల్లో కొంత మంది వ్యక్తులు వన్యప్రాణులను వేటాడే నిమిత్తం అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ షాక్‌కు గురై నరసింహారెడ్డి మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం బద్వేలు – కడప రహదారిలోని వెంకటశెట్టిపల్లె వద్ద మృతదేహంతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. వివరాల్లోకి వెళితే బద్వేలు మండలం వెంకటశెట్టిపల్లె గ్రామానికి చెందిన బీరం నరసింహారెడ్డి గత పదేళ్లుగా బెంగళూరులో హాస్టల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఈయనకు భార్య ఆదిలక్షుమ్మతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అయితే గ్రామంలో భూ రీసర్వే జరుగుతుండటంతో మంగళవారం రాత్రి బెంగళూరు నుంచి బయలుదేరి బుధవారం ఉదయం స్వగ్రామానికి చేరుకున్నాడు. ఉదయం 11 గంటల సమయంలో పొలం వద్దకు వెళ్లి వస్తానని తన కుమార్తెకు చెప్పి వెళ్లాడు. అయితే ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో కుమార్తె నరసింహారెడ్డికి ఫోన్ చేసింది. అయినా స్పందించకపోవడంతో అనుమానంతో బంధువులతో కలిసి పొలం వద్దకు వెళ్లి పరిశీలించగా అక్కడ నరసింహారెడ్డి లేడు. దీంతో చుట్టుపక్కల గాలించే క్రమంలో సమీప దూరంలోని రాజుపాలెం పొలాల్లో గల ముళ్లచెట్లలో నరసింహారెడ్డి పడిపోయి ఉన్నాడు. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై మృతుని కుమార్తె సుకన్య బద్వేలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా డాగ్‌స్క్వాడ్ బృందంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అలాగే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆందోళన

రాజుపాలెం గ్రామ పొలాల్లో శవమై కనిపించిన నరసింహారెడ్డి మృతికి గ్రామంలోని కొందరు వన్యప్రాణుల వేట నిమిత్తం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు కారణమని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బద్వేలు – కడప రహదారిలోని వెంకటశెట్టిపల్లె వద్ద మాజీ జెడ్పీటీసీ శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మృతదేహంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. గతంలో ఇదే మాదిరి సంఘటనలు అనేకం జరిగి మూగజీవాలు, ముగ్గురు వ్యక్తులు మృత్యువాత పడ్డారని, కొందరు తీవ్ర గాయాలపాలయ్యారని, ఈ విషయమై విద్యుత్, పోలీసు, ఫారెస్టు అధికారులకు అనేకమార్లు ఫిర్యాదు చేసినా కఠిన చర్యలు తీసుకోకపోవడంతోనే మరో ప్రాణం బలైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ నాగభూషణ్, ఎస్‌ఐ శ్రీకాంత్‌లు ఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారు వినిపించుకోలేదు. దీంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. పూర్తిస్థాయిలో విచారించి కారకులపై కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆదాయానికి 'గండి' కొట్టే యత్నం!

- గండి టెండర్లల్లో సిండికేట్ అయిన టెండరుదారులు
- రద్దు చేసిన దేవదాయ శాఖ అధికారులు



గండిలో టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

చక్రాయపేట : గండి వీరాంజనేయుడి దగ్గర మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు సమర్పించే తలనీలాలను పోగు చేసుకునే హక్కు తో పాటు ఒక భాగం కొబ్బరి చిప్పలు సేకరించుకునేందుకు దేవదాయశాఖ అధికారులు నిర్వహించిన టెండర్లలో టెండరుదారుల పాచిక పారలేదు. స్వామి ఆదాయానికి గండి కొట్టి లబ్ధి పొందాలనుకుని అందరూ సిండికేట్ కావడంతో అధికారులు టెండర్లను రద్దు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గండిలో ఏడాది కాలం పాటు తలనీలాలు సేకరించుకునే హక్కు కోసం రు.25 లక్షల చొప్పున డిపాజిట్ మొత్తం చెల్లించి టెండర్లలో 9 మంది పాల్గొన్నారు. గత ఏడాది తలనీలాల టెండరు రు.65 లక్షలు పలికింది. ఈ మొత్తంతో పాటు ప్రస్తుతం మార్కెట్‌లోని వెంట్రుకల ధరలను బేరీజు వేసుకొని ఆలయ అధికారులు వేలం పాటను రూ.60 లక్షల నుంచి ప్రారంభించారు. ఇందుకు ఎవరూ నోరు మెదపక పోవడంతో తగ్గించుకుంటూ చివరకు రూ.49 లక్షలతో పాటను మొదలు పెట్టినా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అధికారులు తలనీలాల టెండర్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఒక భాగం కొబ్బరి చిప్పలు సేకరించుకొనే హక్కుకు నిర్వహించిన టెండర్లలోనూ అదే పరిస్థితి నెలకొనడంతో అధికారులు దాన్ని కూడా రద్దు చేశారు. కాగా కొందరు ఎలాగైనా తమకే టెండరు దక్కాలని లేకుంటే మీరు ఇక్కడి నుంచి వెంట్రుకలు, కొబ్బరి చిప్పలు ఎలా తీసుకెళతారో మీ అంతు చూస్తామని బెదిరింపులకు దిగడంతోనే బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారు నోరు మెదపకుండా కూర్చున్నట్లు ప్రచారం జరుగుతోంది. లేదంటే పెద్ద ఎత్తున తమకు కమీషన్లు ఇవ్వాలని కూడా బెదిరించినట్లు సమాచారం.

మళ్లీ టెండర్లు పిలుస్తాం

తలనీలాలు, కొబ్బరి చిప్పల టెండర్లలో తగిన ధర రానందున టెండర్లను రద్దు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు తిరిగి టెండర్లను పిలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి కృష్ణ తేజ, మాజీ చైర్మన్లు వెంకటస్వామి, వీరభాస్కరుడు, ఆలయ ప్రధాన, ఉప ప్రధాన ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, కడప దేవదాయ శాఖ పర్యవేక్షకుడు శివయ్య, ఆలయ సూపరింటెండెంట్ షరీఫ్, ఆర్కే వ్యాలీ ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, చక్రాయపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రాయలసీమలో రాజధాని నిర్మిస్తే భూములు ఇచ్చేందుకు సిద్ధం

పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్



మీడియాతో మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

వేంపల్లె : కూటమి ప్రభుత్వం రాయలసీమలో రాజధాని నిర్మిస్తే అనుకూలమైన భూములు ఇచ్చేందుకు రాయలసీమ వాసులు సిద్ధంగా ఉన్నారని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అమరావతి కోసం బురద నేలల్లో, గుంతల్లో ఎందుకు కష్టపడుతున్నారని, రాయలసీమ వాసులు కూడా హక్కు కలిగినవాళ్లమని, కనుక రాజధాని తమకు ఇవ్వాలని కోరారు. రాయలసీమకు ఓ చరిత్ర ఉందని, పెద్ద, పెద్ద సామ్రాజ్యాలు చూసిన ప్రాంతమన్నారు. రాయలసీమలోని ఏ జిల్లాలోనైనా రాజధానిని తెచ్చి పెడితే సహకరిస్తారని, కర్నూలులో బెంచ్ అవసరం లేదని, హైకోర్టును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్యాన్ని కూటమి ప్రభుత్వం దెబ్బతీస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలకు నరేంద్ర మోదీ, అమిత్ షా అనుమతి ఉంది కదా ఎందుకు సీఎం చంద్రబాబు అంత దైన్యంగా మాట్లాడుతున్నారని ఆయన ప్రశ్నించారు. ధైర్యంగా సూపర్ సిక్స్ పథకాలకు నిధులు మంజూరు చేయాలని ప్రధాని నరేంద్ర మోడీని చంద్రబాబు నిలదీయాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిపోయిందని, గాడిలో పెట్టేందుకు కొంత సమయం పడుతుందని, అంత వరకు సంక్షేమ పథకాలు అమలు చేయలేమని, ప్రజలపై పన్నుల భారం తప్పదని, సీఎం చావు కబురు చల్లగా చెప్పడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో పులివెందుల నియోజకవర్గం సమన్వయకర్త ధృవ కుమార్ రెడ్డి, అనంతపురం మాజీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లూజు విక్రయాలపై కేసు నమోదు

ప్రొద్దుటూరు : స్థానిక సంజీవయ్యనగర్ వద్ద గ్యాస్ లూజు విక్రయాలు చేస్తున్న వ్యాపారి బ్రహ్మయ్యపై పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున కేసు నమోదు చేశారు. గోటీ సెంటర్ నిర్వహిస్తున్న వ్యాపారి బ్రహ్మయ్య షాపులో గ్యాస్ లూజు విక్రయాలు చేస్తున్నాడు. చాలా కాలంగా ఆయన పొయ్యిలకు, ఆటోలకు కిలోల చొప్పున సబ్సిడీ గ్యాస్‌ను విక్రయిస్తున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు గురువారం దాడి చేసి మూడు సిలిండర్లను సీజ్ చేశారు. 6ఏ కేసు నమోదు చేసి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు పంపినట్లు డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

ఐసీఎల్ ఉద్యోగి ఆత్మహత్య



వెంకటనారాయణ మృతదేహం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలోని ఐసీఎల్ కర్మాగారంలో పనిచేస్తున్న కునిశెట్టి వెంకట నారాయణ (50) యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడని డెర్రగుంట్ల సీఐ నరేష్ బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన వెంకటనారాయణ ఐసీఎల్ కాలనీలోనే నివాసం ఉంటూన్నాడు. ఇతనికి భార్య క్రిష్ణవేణితో పాటు ఇద్దరు కుమారులు రాజేష్, చంద్రశేఖర్ ఉన్నారు. పెద్దకుమారుడు రాజేష్ లండన్‌లో ఎంఎస్ చదువుతున్నాడు. చిన్నకుమారుడు చంద్రశేఖర్ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి భార్య క్రిష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కెనరా బ్యాంకులో మహిళ బంగారం అపహరణ

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న కెనరా బ్యాంకులో 4 తులాల బంగారం అపహరణకు గురైనట్లు పట్టణ సీఐ ఎస్. లింగప్ప తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల పరిధిలోని పెద్ద దండ్లూరు గ్రామానికి చెందిన ఇరగం రెడ్డి సావిత్రి గురువారం తనకున్న 3 తులాల బంగారు తాళిబొట్టు సరుడు, తులం బంగారు చైను బ్యాంకులో కుదువపెట్టి డబ్బులు తీసుకునేందుకు వచ్చింది. బంగారును పర్సులో పెట్టి కట్టెల బ్యాగ్‌లో పెట్టుకుంది. గమనించిన ఇద్దరు మహిళలు కట్టెల బ్యాగును కోసి బంగారాన్ని తీసుకుని ఉడాయించారు. ఆమె అధికారుల వద్దకు వెళ్లి బంగారు తాకట్టు పెట్టేందుకు పర్సును చూడగా కనిపించలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బ్యాంకుకు వెళ్లి సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో కౌన్సిలర్ భర్త మృతి



సుబ్బరాజ (ఫైల్)

బద్వేలు అర్బన్ : నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బద్వేలు మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ ఆరేళ్ల రెడ్డెమ్మ భర్త పోలుబోయిన సుబ్బరాజ (32) మృతి చెందాడు. మున్సిపాలిటీ పరిధిలోని చెర్లో రామాపురం గ్రామానికి చెందిన సుబ్బరాజ ఆటో తోలుకుని జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో గత 5 రోజుల క్రితం మర్రిపాడు గ్రామానికి తన ఆటోలో దినసరి కూలీలను తీసుకెళ్లి వదిలి తిరిగి తీసుకువచ్చేందుకు వెళుతుండగా మర్రిపాడు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో పాటు బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తీసుకు వచ్చారు. ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ కూడా పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

అహింసా పద్ధతిలోనే రెడ్‌బుక్ పాలన అంతం

మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు



మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కడప కార్పొరేషన్ : మహాత్మాగాంధీ సూచించిన అంహింసామార్గంలోనే రెడ్‌బుక్ పాలనను అంతమొందిస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా వన్‌టౌన్ కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని, అందులో భాగంగానే గ్రామ, వార్డు సచివాలయాలను తెచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి, కార్పొరేటర్లు షఫీ, అజ్మతుల్లా, పార్టీ నాయకులు జిలాన్, దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య, తోటక్రిష్ణ, ఇలియాస్, రామ్మోహన్ రెడ్డి, వి. నాగేంద్రారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, సీహెచ్ వినోద్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేసిన కేంద్ర బృందం

వారం రోజులు జిల్లాలో పర్యటించనున్న పీఆర్‌సీ మానిటరింగ్ కమిటీ బృందం



ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబుతో మాట్లాడుతున్న డాక్టర్ రమణ

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిని కేంద్ర బృందం అధికారులు పరిశీలించారు. గురువారం పీఆర్‌సీ మానిటరింగ్ కమిటీ బృందంలోని వైద్యులు రమణ, శ్రీనివాస్‌లు జిల్లా ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు. ముందుగా బాలభవిత కేంద్రం , సెంట్రల్ ల్యాబ్‌లను పరిశీలించారు. డీఈఐసీలో అందిస్తున్న సేవలను అక్కడి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే సెంట్రల్ ల్యాబ్‌ను పరిశీలించి ఎన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు, వాటి రిపోర్టు ఇవ్వడానికి ఎంత సమయం పడుతుందో సిబ్బందిని అడిగారు. అనంతరం ఆస్పత్రిలోని వార్డులు, ఓపీ విభాగాలు, ఎంఆర్‌ఐ, సీటీ, డయాలసిస్ విభాగాలు, రక్తనిధి కేంద్రాలను పరిశీలించారు. ఓపీ, ఐపీ రికార్డులను చూశారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో డాక్టర్ రమణ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా ఆస్పత్రిలో అమలవుతున్న పలు ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం తమను ఎంపిక చేసిందన్నారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 1 వరకు జిల్లాలోని పలు ప్రభుత్వ ఆస్పత్రులను పరిశీలించనున్నామన్నారు. మొదటి రోజు డీసీహెచ్‌ఎస్, డీఎంహెచ్‌ఓ అధికారులు, ప్రోగ్రాం అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లాలో జరుగుతున్న పలు ఆరోగ్య కార్యక్రమాల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నామన్నారు. అలాగే ఒంటిమిట్ట, మాధవరం, చాపాడు పీహెచ్‌సీలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో ప్రజలకు వైద్య సేవలు ఎలా అందుతున్నాయి, ఆస్పత్రిలో ఎన్ని విభాగాలున్నాయి, ఓపీ, ఐపీ, ప్రసవాలు, ఇక్కడి పరికరాలు తదితర వాటిని పరిశీలించామన్నారు. అంతే కాకుండా నీతి అయోగ్ ఆధ్వర్యంలో కమిటీ సూచన ప్రకారం జిల్లా ఆస్పత్రులకు ర్యాంకింగ్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజెమ్మ పాల్గొన్నారు.

అధికారుల ఒత్తిడి ..ఆగిన రైతు గుండె



ఆకుల పుల్లయ్య (ఫైల్)

కలసపాడు : రాజకీయ నేత ఒత్తిళ్లకు తలొగ్గిన మండల రెవెన్యూ అధికారులు ఓ రైతు నిండు ప్రాణాన్ని బలితీసుకున్నారు. ఆ రైతు గోడును ఏమాత్రం పట్టించుకోకుండా పోలీసుల సహకారంతో రైతు గడ్డివామి, దిబ్బలను అన్యాయంగా తొలగించారు. కలసపాడు మండలం చింతపల్లె గ్రామానికి చెందిన ఆకుల పుల్లయ్య (68) బుధవారం రాత్రి అకస్మాత్తుగా తీవ్ర ఒత్తిడికి గురై మృతి చెందాడు. గ్రామంలో సర్వేనెంబర్ 1113లో 49 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. అందులో గ్రామంలోని కొంత మంది గత కొన్ని సంవత్సరాలుగా గడ్డివాములు, పేడదిబ్బలు వేసుకుంటున్నారు. మరికొంత మంది రైతుల వద్ద కొందరు కొనుగోలు చేసి ఆ స్థలంలో కంచెలు, చెట్లను వేసుకున్నారు. 1994లో గ్రామానికి చెందిన కమలాపురం కాశిరెడ్డి వద్ద పాడుబడిన మిద్దె, ఖాళీ స్థలం రూ.2.50 లక్షలకు ఆకుల పుల్లయ్య కొనుగోలు చేశాడు. కొనుగోలు చేసిన ఖాళీ స్థలం ప్రభుత్వ భూమి అని ఈ నెల 24వ తేదీన జేసీబీతో రెవెన్యూ అధికారులు చదును చేశారు. ఆకుల పుల్లయ్య ఆధీనంలో ఉన్న స్థలం రెవెన్యూ అధికారులు చదును చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం రాత్రి గుండెపోటుతో పుల్లయ్య మృతి చెందాడు.

పేదలకు మేలు చేయడమే విధ్వంసమా..!

వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి




మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : పేదలకు మేలు చేయడమే విధ్వంసమా...అని వైస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. గురువారం కడపలోని ఎంఎస్‌ఆర్ హిల్ వ్యాలీలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు సూపర్ సిక్స్‌తోపాటు అనేక హామీలిచ్చారని, ఇప్పుడు ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేదని మాట మారుస్తున్నారన్నారు. ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఎక్స్‌పర్ట్‌ని, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ బాగా తెలుసని చెప్పిన చంద్రబాబుకు హామీలిచ్చే ముందు ఆర్థిక పరిస్థితి తెలీదా అని ఎద్దేవా చేశారు. అబద్ధాలపై అబద్ధాలు చెప్పి ప్రజలను మోసగించారని, జనం కూడా తమకు బాబు హామీల వల్ల ఏడాదికి రూ.10లక్షలైనా వస్తుందని ఆశపడి ఓట్లు వేశారన్నారు. ఎన్నికల్లో హామీలిచ్చి అమలు చేయకుండా ప్రజల మనోభావాలతో ఆడుకునే ఇలాంటి వ్యక్తులను రాజకీయాల్లో ఉంచాలా...వద్దా అన్నది వారే నిర్ణయించాలన్నారు. అధికారంలోకి వచ్చిన ఈ 8 నెలల్లోనే రూ.1.19లక్షల కోట్లు అప్పులు చేశారని, ఏ ప్రాజెక్టు చేపట్టకుండా, ఏ ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వకుండా దేనికోసం ఖర్చు చేశారని నిలదీశారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలనే ఆలోచన చంద్రబాబుకు లేదని, తాము 18 మెడికల్ కళాశాలలను తెస్తే వాటిని అడ్డుకుంటున్నారన్నారు. పూర్తయిన పోర్టులను ప్రైవేటుకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారన్నారు. ఏదైనా మాట్లాడితే విధ్వంసం చేశారని అంటున్నారని, పేదలకు మేలు చేయడమే విధ్వంసమా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : సీకే దిన్నె మండలం మూలవంక సమీపంలోఉన్న పాత బ్రిడ్జిని అర్ధరాత్రి సమయంలో పోలీసు బందోబస్తుతో కూల్చివేసిన సంఘటనలో పాల్గొన్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబుతోపాటు ఆయన కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కూల్చివేత వెనుక ఎవరు ఉన్నారో అధికారులు తేల్చాలన్నారు. బ్రిడ్జిని కాపాడాల్సిన అధికారులే పోలీసు బందోబస్తుతో కూల్చి వేయడంలోని ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. కూల్చివేతకు బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే తాము న్యాయం స్థానాలను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భావన టౌన్‌షిప్ ప్లాట్ యజమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సిద్దవటంలో కుష్టు వ్యాధిపై అవగాహన



కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం జరుగుతుందన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులపై, వీపుపై, ఎదపై, నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు స్థానిక వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లెప్రసీ అధికారి రవిబాబు, పి. కొత్తపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మీ, పాఠశాల హెచ్‌ఎం శ్రీరాములు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ముద్దనూరు : స్థానిక 4 రోడ్ల కూడలి సమీపంలో కడప రహదారిలో ఉన్న ఓ యువతి అదృశ్యమైంది. సీఐ దస్తగిరి సమాచారం మేరకు రాజుపాలెం మండలం అర్కటవేములకు చెందిన యువతి ముద్దనూరులో ఉంటోంది. ఈనెల 29వతేదీన ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల విచారించిన కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లారీ.. టిప్పర్ ఢీ

డ్రైవర్ దుర్మరణం



లారీలోనే ఇరుక్కుపోయిన డ్రైవర్ మృతదేహం

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలో గంగాదేవిపల్లె సమీపంలో గురువారం సాయంత్రం ఎదురెదురుగా ప్రయాణిస్తున్న లారీ, టిప్పర్ ఢీకొన్నాయి ఈ ప్రమాదంలో వీరపునాయునిపల్లె మండలం అలిదిన గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ నాగసుబ్బారెడ్డి(36) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. ముద్దనూరు వైపు నుంచి తాడిపత్రికి నాపరాళ్లతో లారీ ప్రయాణిస్తోంది. ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీని ఢీకొంది. ఈ ఘటనలో లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. లారీ క్యాబిన్‌లోనే డ్రైవర్ ఇరుక్కుని మృతి చెందాడు. సుమారు గంటసేపు జేసీబీ సాయంతో లారీలో ఇరుక్కున్న డ్రైవర్ మృతదేహాన్ని పోలీసులు బయటకు తీశారు. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ కిరణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రున్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ దస్తగిరి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూశారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

కొండాపురం : మండల పరిధిలోని చౌటిపల్లె పునరావాస కాలనీ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి భర్త జి. ఓంకార్ పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. అదే కళాశాలలో గతంలో పనిచేసిన పి.వెంకట నాగలక్ష్మిని వేధించారనే ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరంలో గురుకుల జూనియర్ కళాశాలలో సెక్యూరిటీ సూపర్ వైజర్‌గా పనిచేసే సమయంలో ప్రిన్సిపాల్ భర్త ఓంకార్ తనపట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని ఆమె ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ క్రిష్ణవేణిని వివరణ కోరగా వెంకట నాగలక్ష్మి అసత్య ఆరోపణలు చేయడం చాలా అన్యాయమన్నారు.